




ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం

# జనం ముచ్చట

ఆదివారం, ఆగస్టు 30, 2026 fallow on తెలంగాణ పేజీలు : 4




2 లో..

**ఖమ్మం సిటీ, జనం ముచ్చట:** ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ నిధుల దుర్వినియోగానికి, అవినీతికి నిలయంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డీజిల్ వినియోగంలో అక్రమాలు, పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణ పేరిట చోటుచేసుకున్న స్కామ్, రెవెన్యూ హౌస్ ట్యాక్స్ వసూళ్లలో జరిగిన అక్రమాలు ఒకదాని తర్వాత ఒకటి వెలుగులోకి వచ్చినా, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోకపోవడం పట్ల ప్రజల్లో, పౌర సమాజంలో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. జిల్లా నుంచి ముగ్గురు కీలక మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ, కంటిముందే కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగమవుతుంటే మౌనం దాల్చడంపై తీవ్ర ప్రశ్నలు తలెత్తుతున్నాయి...

# ఖమ్మం మున్సిపల్ కార్పోరేషన్‌లో..

# పడకేసిన క్వాలిటీ కంట్రోల్

## ఖమ్మం కార్పొరేషన్‌లో విచ్చలవిడి అవినీతి,ప్రజాధనం లూటీపై ప్రజా సంఘాల ఆగ్రహం

**నాణ్యతకు తిలోదాకాలిస్తున్న కాంట్రాక్టర్లు...**

నగర పరిధిలో జరుగుతున్న మౌలిక వసతుల పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పూర్తిగా దిగజారాయి. సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు, మున్సిపల్ భవనాల పనుల్లో కాంట్రాక్టర్లు నాసిరకం మెటీరియల్‌ను వాడుతున్నారు. నిర్మాణం పూర్తయిన కొన్ని నెలలకే రోడ్లు గుంతలమయం కావడం, డ్రైనేజీలు కూలిపోతుండడంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సాంకేతిక నిబంధనల ప్రకారం సీసీ రోడ్ల మందం, కాంక్రీట్ మిశ్రమం మోతాదులో తీవ్ర అక్రమాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిబంధనలు పాటించని కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్టులో పెట్టాల్సింది పోయి, అధికారులే వారికి కొమ్ముకాయడం వెనుక పెద్ద ఎత్తున ముడుపుల వ్యవహారం నడుస్తోందనే ఆరోపణలు ఉన్నాయి...

# మద్యం మత్తులో అసభ్యకరంగా మాట్లాడాడని హత్య

**మధిర, జనం ముచ్చట:**

మధిర పట్టణంలోని పీవీఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలో ఇటీవల చోటుచేసుకున్న అనుమానాస్పద మృతి కేసును మధిర టౌన్ పోలీసులు ఛేదించారు. మృతుడు ఎండీ తాలిమ్‌ను హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఏసీపీ సారంగపాణి వెల్లడించారు.

ఏసీపీ సారంగపాణి తెలిపిన వివరాల ప్రకారం.. ఎండీ తాలిమ్ మద్యం మత్తులో ఉండగా అసభ్యకరంగా మాట్లాడటంతో వివాదం తలెత్తినట్లు పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో రాములమ్మ, జమలయ్య కలిసి తాలిమ్‌పై కర్రతో దాడి చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ దాడిలో తాలిమ్ తలకు బలమైన గాయం




2 లో..

మధిరలో అనుమానాస్పద మృతి కేసు ఛేదించిన పోలీసులు..ఇద్దరు నిందితుల అరెస్ట్

### ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్లో...

# పడకేసిన క్వాలిటీ కంట్రోల్

(మొదటి పేజీ తరువాయి)



**క్వాలిటీ కంట్రోల్ పేరుతో నిలువుదోపిడీ...**

పనుల్లో నాణ్యతను నిష్పాక్షికంగా తనిఖీ చేయాల్సిన క్వాలిటీ కంట్రోల్ వ్యవస్థ అవినీతి కూపంలో మునిగిపోయింది. క్షేత్రస్థాయి పరిశీలనలు లేకుండానే, కాంట్రాక్టర్లు ఇచ్చే కమీషన్లకు కక్కుర్తిపడి క్వాలిటీ కంట్రోల్ ఏజెన్సీలు "ఆల్ ఈజ్ వెల్" అంటూ క్లియరెన్స్ సర్టిఫికెట్లు ఇస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. క్షేత్రస్థాయికి వెళ్ళి శాంపిల్స్ సేకరించకుండానే బోగస్ ల్యాబ్ రిపోర్టులు తయారుచేయడం.పనుల్లో లోపాలున్నా "మనీ ఫర్ రిపోర్ట్" అనే చందంగా కమీషన్లు అందితే వెంటనే ఆమోదముద్ర వేయడం.

ఈ నకిలీ క్వాలిటీ రిపోర్టుల ఆధారంగానే ఇంజనీరింగ్ అధికారులు కోట్లాది రూపాయల బిల్లులను ఆమోదిస్తూ ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారనీ స్థానికులు ఆరోపిస్తున్నారు

**ముగిసిన టెండర్లు.. పునరుద్ధరణల పర్వం**

టెండర్ నిబంధనలను పాతరేస్తూ మున్సిపల్ కార్పొరేషన్ యంత్రాంగం వ్యవహరిస్తున్న తీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.గతంలో నియమించిన కొన్ని క్వాలిటీ కంట్రోల్ ఏజెన్సీల టెండర్ కాలపరిమితి ముగిసి సుదీర్ఘ కాలం గడుస్తున్నా, కొత్తగా ఓపెన్ టెండర్లు పిలవకుండా పాత ఏజెన్సీలనే 'ఎక్స్‌టెన్షన్' పేరుతో కొనసాగిస్తున్నారు. నిబంధనల ప్రకారం నిర్ణీత గడువు ముగియగానే కొత్త టెండర్లు ఆహ్వానించాల్సి ఉన్నప్పటికీ, రాజకీయ ఒత్తిళ్ళు మరియు వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాల కోసం పాత ఏజెన్సీలతోనే లోపాయికారీ ఒప్పందాలు కుదుర్చుకుని నాసిరకం పనులకు ఆమోదం తెలుపుతున్నట్టు తీవ్ర స్థాయిలో ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**కుంభకోణాల సూత్రధారులపై చర్యలేవి?**

మంత్రి తుమ్మల స్వయంగా ప్రాతినిధ్యం వహిస్తున్న ఖమ్మం నగరంలోనే ఈ స్థాయిలో అవినీతి పర్వం కొనసాగుతుండడం పలు విమర్శలకు తావిస్తోంది. సుపరిపాలన అందిస్తామని చెప్పిన నాయకులు, కార్పొరేషన్ స్థాయిలో జరుగుతున్న దోపిడీని ఎందుకు అరికట్టలేకపోతున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.గతంలో వెలుగులోకి వచ్చిన డీజిల్ స్కామ్, ట్యాక్స్ స్కామ్,ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపుల్లో అవినీతి వంటి అనేక కుంబకోణాలు బయట పడినప్పటికి ఆయా కుంబకోణాలకు పాల్పడిన ప్రధాన సూత్రధారులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో కమీషనర్ చిత్తశుద్ధిని శంకించాల్సిన పరిస్థితి ఉత్పన్నం అవుతుంది.

ముఖ్యంగా ప్రజలు చెల్లించే ఆస్తి పన్నులు, ఇతర రసుములు అభివృద్ధి పనులకు కాకుండా అవినీతిపరుల జేబుల్లోకి చేరుతున్నాయనే ఆవేదన ప్రజల్లో వ్యక్తమవుతోంది.

**తక్షణ చర్యలకు ప్రజా సంఘాల డిమాండ్....**

మున్సిపల్ కార్పొరేషన్లో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని విపక్షాలు, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

గత కొంత కాలంలో నగరంలో జరిగిన అన్ని రకాల నాసిరకం పనులు, క్వాలిటీ కం ట్రోల్ రిపోర్టులు, కాలం చెల్లిన టెండర్ ఏజెన్సీల కొన సాగింపుపై ఉన్నత స్థాయి విజిలెన్స్ విచారణ జరిపి ంచాలనీ,నకిలీ నాణ్యత రిపోర్టులతో ప్రజాధనాన్ని దోచు కున్న కాంట్రాక్టర్లు, ఏజెన్సీల నుండి నిధులను రికవరీ చేసి, సంబంధిత ఏజెన్సీలను తక్షణమే బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలనీ, పారదర్శక విధానంలో నూతన క్వాలిటీ కం ట్రోల్ ఏజెన్సీలకు టెండర్లు నిర్వహించాలనీ, మున్సిపల్ కార్పొరేషన్లో జరుగుతున్న అవినీతి పరంపరపై ఉన్నతాధికారులు, ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే మున్సిపల్ కార్పొరేషన్ ముట్టడితో పాటు పెద్ద ఎత్తున ప్రజా ఆందోళనలు చేపడతామని వివిధ ప్రజా సంఘాల నాయకులు హెచ్చరిస్తున్నారు.

---

### పర్యవేక్షణతో అభివృద్ధి పనులు

# నాణ్యతతో పూర్తి చేయాలి

**మంత్రి తుమ్మల నాగేశ్వర రావు**

**నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజా ప్రతినిధులతో పాటు స్థానిక ప్రజలు కూడా నిరంతరం పర్యవేక్షించాలి.**

**రూ. 95.50 లక్షల సుడా నిధులతో రోడ్లు, సీసీ డ్రైన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన తుమ్మల**



ఖమ్మం, జనం ముచ్చట

నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను పర్యవేక్షణతో నాణ్యతతో పూర్తి చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని 42వ డివిజన్‌లో రూ. 95.50 లక్షల సుడా నిధులతో చేపట్టనున్న రోడ్లు, సీసీ డ్రైన్ల నిర్మాణ పనులకు మంత్రి వర్యులు శనివారం శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే ప్రతి అభివృద్ధి పనిని నాణ్యతతో చేపట్టి, పదికాలాల పాటు మన్నికగా ఉండే విధంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పనుల అమలులో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, ప్రభుత్వ నిధులను పారదర్శకంగా వినియోగించాలని స్పష్టం చేశారు.

అభివృద్ధి పనులను ప్రజాప్రతినిధులతో పాటు స్థానిక ప్రజలు కూడా నిరంతరం పర్యవేక్షించాలని, ప్రజల భాగస్వామ్యంతో చేపట్టే పనులు మరింత నాణ్యతగా పూర్తవుతాయని మంత్రి పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన మౌళిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోందని అన్నారు.

నగరంలో విశాలమైన రహదారులు, మెరుగైన మౌళిక సదుపాయాలు కల్పించడం ద్వారా అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని మంత్రి పేర్కొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్న మంత్రి, పరిశుభ్రత వల్ల ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా కుటుంబాలపై వైద్య ఖర్చుల భారం తగ్గుతుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, మునిసిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

---




### మద్యం మత్తులో అసభ్యకరంగా...

# మాట్లాడాడని హత్య

(మొదటి పేజీ తరువాయి)

కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు....

**సీసీ ఫుటేజీలతో వెలుగులోకి అసలు నిజం...**

తాలిమ్ మృతదేహం రోడ్డు పక్కన అనుమానాస్పద స్థితిలో కనిపించడంతో మధిర టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించడంతో పాటు, అందుబాటులో ఉన్న ఇతర ఆధారాలను సేకరించి పోలీసులు దర్యాప్తును ముందుకు తీసుకెళ్లారు.సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితుల కదలికలను గుర్తించిన పోలీసులు.. చివరకు రాములమ్మ, జమలయ్యలను అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో తాలిమ్‌పై దాడి చేసినట్లు వారు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు.

**హత్య అనంతరం మృతదేహాన్ని రోడ్డుపక్కన పడేశారు...**

**నిందితులను రిమాండ్ కు తరలించిన పోలీసులు...**

తాలిమ్‌పై దాడి అనంతరం అతడు మృతి చెందిన విషయాన్ని గుర్తించిన నిందితులు.. మృతదేహాన్ని రోడ్డు పక్కకు తరలించి పడవేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. దీంతో తొలుత అనుమానాస్పద మృతిగా కనిపించిన ఘటన వెనుక హత్య కోణం వెలుగులోకి వచ్చింది.కేసులో ప్రధానంగా అనుమానిస్తున్న రాములమ్మ, జమలయ్యలను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ సారంగపాణి తెలిపారు.సీసీ ఫుటేజీలను ఆధారంగా చేసుకుని పక్కా దర్యాప్తుతో అనుమానాస్పద మృతి కేసును హత్య కేసుగా ఛేదించడం ద్వారా మధిర టౌన్ పోలీసులు కీలక పురోగతి సాధించారు. కేసు దర్యాప్తు కొనసాగుతున్నట్లుపోలీసులు తెలిపారు.

# ప్రభుత్వ మెడలు వంచైనా ఫీజు బకాయిలు సాధిస్తాం.

**విద్యార్థుల జీవితాలతో కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాల చెలగాటం.**

**తక్షణమే రూ. 15 వేల కోట్లు విడుదల చేయాలి.**

**బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు.**

**ఖమ్మం ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో బీజేపీ నిరసన దీక్ష.**



ఖమ్మం, జనం ముచ్చట

విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా ఆధ్వర్యంలో శనివారం ఖమ్మం ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద నిరసన దీక్ష చేపట్టింది. జిల్లా బీజేపీ అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు నేతృత్వంలో, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు శాసనాల సాయిరాం ఆధ్వర్యంలో జరిగిన ఈ దీక్షలో బీజేపీ, యువమోర్చా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. 'ఫీజుల బకాయి--బీజేపీ లడాయి' నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు ప్లకార్డులు చేతబట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ చేపట్టిన ఆందోళనలో భాగంగానే ఖమ్మంలోనూ ఈ దీక్ష నిర్వహించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు తీవ్రస్థాయిలో విమర్శించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు ప్రభుత్వం అందించే ఫీజు రీయింబర్స్‌మెంట్ అత్యంత కీలకమైనదని, ఆ నిధులు సకాలంలో విడుదల కాకపోవడం వల్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. చదువు పూర్తయిన తర్వాత కూడా బకాయిల కారణంగా విద్యార్థులు వివిధ సమస్యలను ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం ఆటలాడకూడదు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అనేది ప్రభుత్వం విద్యార్థులకు చేస్తున్న దానం కాదు. ఉన్నత విద్యను కొనసాగించేందుకు అర్హులైన విద్యార్థులకు అందాల్సిన హక్కు. ఆ నిధులను వెంటనే విడుదల చేయాలి అనే ప్రధాన డిమాండ్‌తోనే బీజేపీ పోరాటాన్ని కొనసాగిస్తోందని కోటేశ్వరరావు స్పష్టం చేసినట్లు కార్యక్రమంలో వెల్లడైంది.

రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లకు సంబంధించి దాదాపు రూ.15 వేల కోట్ల బకాయిలు ఉన్నాయని బీజేపీ ఆరోపిస్తోంది. ఈ మొత్తాన్ని ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర బీజేపీ ఇప్పటికే డిమాండ్ చేస్తోంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు నేతృత్వంలో ఆగస్టు 24, 25 తేదీల్లో నిర్వహించిన రెండు రోజుల నిరాహార దీక్షకు కొనసాగింపుగా రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఆందోళనలు నిర్వహిస్తున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల సమస్య కేవలం కళాశాలలకే పరిమితమైన ఆర్థిక అంశం కాదని, దాని ప్రభావం నేరుగా విద్యార్థుల చదువుపై పడుతోందని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. ఫీజులు అందకపోవడంతో కొన్ని సందర్భాల్లో విద్యార్థులకు ధ్రువపత్రాలు అందడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ఉన్నత విద్యకు వెళ్లాలనుకునే వారికి, ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే వారికి కూడా సమస్యలు ఎదురవుతున్నాయని బీజేపీ రాష్ట్ర నాయకత్వం ఆరోపిస్తోంది.

ఖమ్మం ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద జరిగిన దీక్షలో బీజేపీ నాయకులు ఒకే వేదికపై కూర్చొని ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలంటూ నినదించారు. కార్యక్రమ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బ్యానర్‌పై ఫీజుల బకాయి -- బీజేపీ లడాయి అనే నినాదాన్ని ప్రధానంగా ప్రదర్శించారు. నాయకులు, కార్యకర్తలు చేతుల్లో ఇదే నినాదంతో కూడిన ప్లకార్డులను ప్రదర్శిస్తూ విద్యార్థుల సమస్యపై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. పార్టీ కాషాయ కండువాలు ధరించిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో దీక్షలో పాల్గొనడంతో ప్రాంగణం రాజకీయ నిరసన వాతావరణాన్ని సంతరించుకుంది.

విద్యార్థుల చదువు మధ్యలో ఆగిపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని నెల్లూరి కోటేశ్వరరావు పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించేందుకు అప్పులు చేసి, ఆస్తులు తాకట్టు పెట్టి, అనేక కష్టాలు పడుతున్నారని, అలాంటి కుటుంబాలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన ఫీజు రీయింబర్స్ మెంట్ సకాలంలో అందకపోతే వారి పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందని ఆయన అన్నారు. విద్యా రంగానికి ప్రాధాన్యం ఇస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, ఆచరణలో విద్యార్థుల బకాయిలను విడుదల చేయకపోవడం ఆ ప్రకటనలకు విరుద్ధంగా ఉందని బీజేపీ నాయకులు విమర్శించారు.

ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిల అంశాన్ని రాజకీయ కోణంలో మాత్రమే చూడకుండా విద్యార్థుల సమస్యగా చూడాలని కోటేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. పేద, బలహీన వర్గాల విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి తమ కుటుంబాల ఆర్థిక స్థితిని మెరుగుపర్చుకోవాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న సమయంలో బకాయిలు పేరుకుపోవడం వారి అవకాశాలను దెబ్బతీస్తుందని ఆయన అన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం అండగా నిలవాల్సిన సమయంలో వారినే ఇబ్బందులకు గురిచేసే పరిస్థితి తలెత్తడం సరికాదని పేర్కొన్నారు.

ఇదే అంశంపై రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు ఇప్పటికే ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్ షిప్‌ల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన దీక్ష సందర్భంగా విద్యార్థుల నుంచి సంతకాలు సేకరించే కార్యక్రమాన్ని కూడా బీజేపీ చేపట్టింది. ఫీజు బకాయిల కోసం విద్యార్థులు ఆందోళనలు చేస్తుంటే వారిపై పోలీసుల చర్యలు తీసుకోవడం సరికాదని ఆయన విమర్శించారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు తమ పోరాటం కొనసాగుతుందని రాష్ట్ర నాయకత్వం స్పష్టం చేసింది.

ఖమ్మం జిల్లాలో జరిగిన దీక్షకు బీజేపీ నాయకులు, బీజేవైఎం కార్యకర్తలు విశేషంగా తరలివచ్చారు. సన్నే ఉదయ్ ప్రతాప్, పాలేరు అసెంబ్లీ ఇన్‌చార్జి నున్నా రవికుమార్, భూక్యా శ్యాంసుందర్ నాయక్, గుత్తా వెంకటేశ్వర్లు, మంద సరస్వతి, శ్రీరామనేని మణి, రవి రాథోడ్, రవి గౌడ్, మృత్యుంజయరావు, వాకా ధాని రామకృష్ణ, గుత్తా వంశీ, జ్వాలా నర్సింహారావు, ఖమ్మం టూ టౌన్ ప్రధాన కార్యదర్శి రుద్రగాని మాధవ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థుల సమస్యపై ప్రభుత్వాన్ని నిలదీస్తూ కార్యకర్తలు నినాదాలు చేయడంతో దీక్షా ప్రాంగణం హోరెత్తింది.

బీజేపీ చేపట్టిన ఈ ఆందోళనకు రాష్ట్రవ్యాప్త నేపథ్యం కూడా ఉంది. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్ షిప్ నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు నెలలో పార్టీ వరుస కార్యక్రమాలకు పిలుపునిచ్చింది. జిల్లా కేంద్రాల్లో నిరసనలు, దీక్షలు నిర్వహిస్తూ విద్యార్థుల సమస్యను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తోంది. ఆగస్టు 29న రాష్ట్రవ్యాప్తంగా ఒక్కరోజు నిరాహార దీక్షలు చేపట్టాలని కూడా పార్టీ ప్రకటించిన నేపథ్యంలో ఖమ్మంలో ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద దీక్ష నిర్వహించారు.

ఫీజు బకాయిల విషయంలో ప్రభుత్వం వెంటనే స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఎప్పటిలోగా బకాయిలు విడుదల చేస్తారో, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోబోతోందో వెల్లడించాలని కోరారు. కేవలం హామీలతో సమస్య పరిష్కారం కాదని, విద్యార్థుల ఖాతాలు, కళాశాలలకు చెల్లించాల్సిన బకాయిలు వాస్తవంగా విడుదలైన అప్పుడే సమస్యకు పరిష్కారం లభించినట్ల అవుతుందని అన్నారు.

ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్ నిధులను విడుదల చేయకపోతే ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని బీజేపీ నాయకులు హెచ్చరించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యా సంస్థలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.

ఖమ్మం వేదికగా సాగిన ఈ దీక్షతో ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిల అంశం మరోసారి రాజకీయ చర్చకు వచ్చింది. విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు ప్రభుత్వం వెంటనే బకాయిలను విడుదల చేయాలని, లేకపోతే ప్రజా ఉద్యమాన్ని మరింత విస్తృతం చేస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు నేతృత్వంలోని శ్రేణులు స్పష్టం చేశాయి. "ఫీజుల బకాయి -- బీజేపీ లడాయి" నినాదంతో చేపట్టిన ఈ పోరాటాన్ని సమస్య పరిష్కారం అయ్యే వరకు కొనసాగిస్తామని పార్టీ శ్రేణులు ప్రకటించాయి.

ఈ దీక్షలో నల్గొండ ప్రభారి సన్నె ఉదయ్ ప్రతాప్, పాలేరు నియోజకవర్గం నుంచి పోటీ చేసిన నున్నా రవి, నాయకులు శ్యామ్ రాథోడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుత్తా వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు రవి రాథోడ్, ఉపాధ్యక్షుడు నకిరేకంటి వీరభద్రం, మీడియా కన్వీనర్ డా.. నెల్లూరి బెనర్జీ,మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు మందా సరస్వతి, జిల్లా కార్యదర్శులు రామశెట్టి నాగేశ్వరరావు, మణి, శ్రీలక్ష్మి, ఆఫీస్ సెక్రటరీ రవిగౌడ్, మండల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లు కూల్చిన ఉదంతంపై తుమ్మల యుగంధర్ కు బాధితుల ఫిర్యాదు



ఖమ్మం, జనం ముచ్చట

ఇటీవల రఘునాథపాలెం మండలం పువ్వాడ ఉదయ్ నగర్ లో తాను లేని సమయంలో రాత్రిపూట తన ఇల్లును కూల్చివేసిన ఉదంతంపై బాధితురాలు బుక్యా నాగేంద్ర తన భర్త శ్రీనివాస్ తో కలిసి , వీరనారీమణుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షురాలు భూక్య ఉపేంద్రబాయి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ యువ నేత తుమ్మల యుగంధర్ కు శనివారం ఫిర్యాదు చేశారు. ఇటీవల ఖమ్మం నగరంలోని రామచంద్రయ్య ప్రాంతంలో జరిగిన ఘర్షణలో తాను పోలీసులకు ఫిర్యాదు చేయగా ఆ కేసును విత్ డ్రా చేసుకోమని నిందితులు తనను బెదిరిస్తున్నారని మరో బాధితురాలు కళావతి కూడా ఇదే సమయంలో తుమ్మల యుగంధర్ కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఉపేంద్ర బాయి కు ఏమాత్రం సంబంధం లేకున్నా ఆమెను వివిధ సామాజిక మాధ్యమాలలో టార్గెట్ చేస్తూ అసభ్య పదజాలంతో దూషించడమే కాకుండా ఆమె వ్యక్తిత్వాన్ని హననం చేస్తున్నారని నాగేంద్ర తన ఫిర్యాదులో పేర్కొంటూ తన ఇల్లు కూల్చిన సంఘటనలో పాల్గొన్న వారందరిపై చర్యలు తీసుకుని, వారి నుండి తనకు నష్టపరిహారాన్ని ఇప్పించాలని కోరారు. అంతేకాకుండా గతంలో కూడా ఇదే విధంగా సర్పంచ్ అనుచరులు తన ఇంటి పై దాడికి దిగిన విషయాన్ని ప్రస్తావిస్తూ ఆనాడే పోలీసులు చర్యలు తీసుకుంటే ఈ ఇల్లు కూల్చబడేది కాదని తన ఫిర్యాదులో ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వారందరిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తన ఈ విషయంలో ప్రశ్నించినందుకు ఒంటరి, లంబాడి గిరిజన మహిళ ఉపేంద్ర బాయి ను కుల వివక్షతో టార్గెట్ చేసిన ఈ నిందితులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాలని కోరారు. మరో బాధితురాలు కళావతి తన వినతి పత్రంలో.... ఇటీవల జరిగిన ఒక ఘర్షణలో తాను పోలీసులకు ఫిర్యాదు చేయగా నమోదైన కేసును విత్ డ్రా చేసుకోమని నిందితులు ఇంటికి వచ్చి మరీ బెదిరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. యువ నేత దీనిపై దృష్టి సారించి తనకు న్యాయం చేయాలని , వారి నుండి తనకు ప్రాణహాని ఉన్న దృష్ట్యా తనకు రక్షణ కల్పించాలని వినతి పత్రంలో ఆమె విన్నవించారు. ఈ కార్యక్రమంలో వీరనారీమణుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షురాలు భూక్య ఉపేంద్రబాయి, నాయకులు నల్ల నాగమణి, ఏ.సరోజని, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దాసరి శ్రీను, గిరిజన నాయకులు రాంబాబు నాయక్ నాయక్ , వీరన్న నాయక్, కాంగ్రెస్ నాయకుడు రాము తదితరులు పాల్గొన్నారు.

# వేగవంతంగా గోదావరి పుష్కర పనులు

## - భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్



కొత్తగూడెం, జనం ముచ్చట

వచ్చే ఏడాది 2027 జూన్ – జూలై నెలలో జరుగనున్న గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని భద్రాద్రి జిల్లాలోని ఆయా పుష్కర ఘాట్ ల వద్ద భక్తుల సౌకర్యార్థం పుణ్య స్నానాలు ఆచరించేందుకు వీలుగా సదుపాయాల కల్పన పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకున్నామని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో కలిసి హైదరాబాద్ నుండి శనివారం రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంత రావులు ఆయా జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ప్రభుత్వం సంకల్పించిన దృష్ట్యా, పుష్కర ఘాట్ల వద్ద విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని వారు సూచించారు. ఇప్పటికే ఆమోదం పొందిన పనులను మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులను ఆహ్వానించి తక్షణమే ప్రారంభించాలని అన్నారు. ఈ పనుల పర్యవేక్షణ కోసం తగిన అనుభవం కలిగిన సీనియర్ అధికారిని స్పెషల్ ఆఫీసర్ గా నియమించాలని అన్నారు. భూసేకరణ అవసరమైన పక్షంలో వెంటనే ప్రతిపాదనలు పంపాలని సూచించారు. పుష్కరాలకు మరో పది నెలల గడువు మాత్రమే మిగిలి ఉన్నందున సదుపాయాల కల్పన పనులను చేపట్టి వేగవంతంగా పూర్తి చేయాలని హితవు పలికారు. వారం వారం పనుల ప్రగతిని సమీక్షిస్తూ, నివేదికలు సమర్పించాలని సూచించారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న సందర్భంగా భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ.... జిల్లాలోని భద్రాచలం పుష్కర క్షేత్రం వద్ద భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్న నేపథ్యంలో ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తున్నామని తెలిపారు. ఎండోమెంట్, ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ తదితర శాఖల ఆధ్వర్యంలో పనులు వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. అదేవిధంగా జిల్లాలోని గోదావరి పరీవాహక ప్రాంతాలైన పర్ణశాల, మోతే పట్టి నగర్ పుష్కర ఘాట్ ఏర్పాటు కోసం క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్నామని తెలిపారు. పుణ్య స్నానాలు ఆచరించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులతో పాటు వీ.ఐ.పీలు, వీ.వీ.ఐ.పీలు తరలివచ్చే అవకాశాలు ఉన్నందున వాహనాల పార్కింగ్, సరైన రోడ్డు వసతి, అత్యవసర ఎగ్జిట్ వంటి అన్ని వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. పుష్కర ఘాట్ల వరకు అప్రోచ్ రోడ్లు, ఘాట్ల మరమ్మతులు వంటి పనులను ప్రాధాన్యతాక్రమంలో చేపట్టాలని ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

# ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలి




## - రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి
## - పాల్గొన్న జిల్లా కలెక్టర్ అంకిత్

కొత్తగూడెం, జనం ముచ్చట

ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి ఉన్నత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, ఈ.ఆర్.ఓ లు, ఎ.ఈ.ఆర్.ఓ. లతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో నోటీసుల జారీ, పరిష్కార చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ.. నోటీసుల పంపిణీ వేగవంతం చేయాలని, ఫిర్యాదులు, అభ్యంతరాలపై నిర్దిష్ట గడువులో విచారణ చేపట్టాలని, సంబంధిత రికార్డుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. నోటీసుల పంపిణీ ప్రక్రియను మరింత వేగవంతం చేసి, పెండింగ్‌లో ఉన్న అన్ని నోటీసులను సంబంధిత వ్యక్తులకు తప్పనిసరిగా అందజేయాలని, నోటీసులు అందజేసిన రోజు నుండి 7 రోజుల గడువు పూర్తయిన అనంతరం విచారణ నిర్వహించాలని సూచించారు. అనామలీస్/నో మ్యాపింగ్ జాబితాను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ఏజెంట్లకు అందుబాటులో ఉంచాలని, సంబంధిత వ్యక్తులు క్లెయిమ్స్, అభ్యంతరాల సందర్భంగా సమర్పించాల్సిన పత్రాలు, ఆధారాలపై స్పష్టమైన అవగాహన కల్పించేందుకు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని తెలిపారు. క్లెయిమ్స్, అభ్యంతరాల ప్రస్తుత స్థితిని రోజువారీ ప్రాతిపదికన నోటీస్ బోర్డుపై నవీకరించాలని, ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తూ, నిర్దేశిత గడువులో పనులను పూర్తి చేయాలని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరిష్కార ప్రక్రియను సజావుగా నిర్వహించాలని తెలిపారు. ప్రక్రియ కొరకు నియమించిన ఎ.ఈ.ఆర్.ఓ. లకు అవసరమైన శిక్షణ అందించాలని, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి ప్రక్రియ వేగవంతానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు.

భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ.. జిల్లాలో అనామోలీస్, మ్యాపింగ్ కానీ ఓటర్లకు సంబంధించి నోటీసులు జారీ చేసి యాప్ లో వివరాలు నవీకరించడం జరిగిందని తెలిపారు. నోటీసుల హియరింగ్ ప్రక్రియ పూర్తి చేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ప్రక్రియ నిర్వహించి నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఏఐటియూసి రాష్ట్ర మహాసభలను జయప్రథం చేయండి

## - ఏఐటియూసి జిల్లా గౌరవ అధ్యక్షులు షాబీర్ పాషా

కొత్తగూడెం, జనం ముచ్చట

వచ్చేనెల సెప్టెంబర్ 6,7,8 తేదీల్లో కరీంనగర్ లో జరిగే ఏఐటియూసి రాష్ట్ర 4వ మహాసభలను జయప్రథం చేయాలని ఏఐటియూసి జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. ఈ మేరకు శనివారం స్థానిక ఏఐటియూసి కార్యాలయం శేషగిరి భవన్లో మహాసభల పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను పాల్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక సంక్షేమ చట్టాను రద్దు చేసి పెట్టుబడి దారీ అనుకూ వర్గాలకు ఊడిగం చేసే విధంగా నాలుగు లేబర్ కోడ్లు ప్రవేశపెట్టారని మండిపడ్డారు. రానున్న రోజుల్లో ప్రభుత్వరంగ సంస్థలు కనుమరుగు అవుతాయని, ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలు లేకుండాపోయే ప్రమాదం ఉందన్నారు. పోరాడి సాధించుకున్న 8 గంటల పనిదినం, సంక్షేమ చట్టాలు మొత్తం మసక బారుతున్నాయని అన్నారు. ఈ మహాసభల్లో కార్మిక సంక్షేమ చట్టాలను కొనసాగించుకునేందుకు కనీస వేతనాలను ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకునేందుకు ప్రైవేటీ కరణకు వ్యతిరేకంగా నిర్వహించే పోరాటాలను చర్చించనున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 750 మంది ప్రతినిధులు ఈ మహాసభలకు హాజరుకానున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్య, కార్యదర్శి నరాటి ప్రసాద్, కార్యదర్శులు జి నగేష్, భూక్య శ్రీనివాన్, జి వీరస్వామి రేను ఎల్లయ్య గుర్రం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిలో కార్మిక సంఘాల హామీల అమలు ఎక్కడ..?




## - గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల తీరుపై టీబీజీకేఎస్ తీవ్ర విమర్శలు
## - సెప్టెంబర్‌లోగా లాభాలు ప్రకటించి 40 శాతం వాటా ఇవ్వాలి

కొత్తగూడెం, జనం ముచ్చట

సింగరేణిలో గుర్తింపు ప్రాతినిధ్య కార్మిక సంఘాలు రాబోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా జిమ్మిక్కులు చేస్తున్నాయని టీబీజీకేఎస్ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి కాపు కృష్ణ తీవ్రంగా విమర్శించారు. కొత్తగూడెంలోని టీబీజీకేఎస్ కార్పొరేట్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐఎన్‌టీయూసీ 36 హామీలు, ఏఐటీయూసీ 48 హామీలు ఇచ్చాయని, రెండు సంవత్సరాల ఎనిమిది నెలలు కావస్తున్నా కార్మికులకు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా పూర్తిస్థాయిలో అమలు కాలేదని ఆరోపించారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కార్మికులను ఆకట్టుకునేందుకు కొత్త ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు. అనర్హత కేసుల్లో 80 నుంచి 90 శాతం వరకు పరిష్కారం చూపడంతో పాటు సుమారు 14 వేల మందికి వారసత్వ ఉద్యోగాలు కల్పించిన ఘనత టీబీజీకేఎస్‌కు, అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దక్కుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం మూడు వైద్య బోర్డులు నిర్వహిస్తామని హామీ ఇచ్చిన ఏఐటీయూసీ, రెండేళ్లకుపైగా కాలంలో పరిమిత సంఖ్యలోనే వైద్య బోర్డులు నిర్వహిస్తూ 10 నుంచి 15 శాతం వరకు మాత్రమే అనర్హత కేసులకు పరిష్కారం చూపుతోందని విమర్శించారు. ప్రస్తుతం సింగరేణిలో అధికారులు, ఉద్యోగులు, కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం రోడ్డెక్కి ఆందోళనలు, నిరాహార దీక్షలు చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని కాపు కృష్ణ అన్నారు. జేఏఈటీల ప్రమోషన్ల కోసం రోడ్డెక్కి నిరాహార దీక్షలు చేయాల్సి రావడం గతంలో ఎన్నడూ లేని పరిస్థితికి నిదర్శనమన్నారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఏఐటీయూసీ ఆర్‌ఎల్‌సీకి సమ్మె నోటీసు ఇవ్వడం కార్మికుల సమస్యల పరిష్కారం కంటే రాజకీయ ప్రయోజనాల కోసమేనని ఆరోపించారు. కార్మికులకు 250 గజాల ఇంటి స్థలం, రూ.20 లక్షల వడ్డీలేని రుణాలు, మారుపేర్ల సమస్య పరిష్కారం వంటి హామీలు కూడా అమలుకు నోచుకోలేదని కాపు కృష్ణ విమర్శించారు. వేతనాలపై ఆదాయపు పన్ను రద్దు చేస్తామని హామీ ఇచ్చి రెండున్నరేళ్లలో కేవలం రెండు సమావేశాలు నిర్వహించడం మినహా కార్మికులకు ఆర్థికంగా ఎలాంటి ప్రయోజనం చేకూరలేదన్నారు. సింగరేణి లాభాలను సెప్టెంబర్‌లోగా ప్రకటించి వచ్చిన మొత్తం లాభాలల్లో కార్మికులకు 40 శాతం లాభాల వాటా ఇవ్వాలని కాపు కృష్ణ డిమాండ్ చేశారు. కార్మికుల శ్రమతో సంస్థకు లాభాలు వస్తున్నందున ఆ లాభాల్లో వారికి న్యాయమైన వాటా కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి శ్రీనివాస్ రావు?, రాజశేఖర్, ?కె. విజయ్ కుమార్, ?కంచర్ల శ్రీనివాస్, ?మారపాక తిరుపతి, ?రవి వర్మ, ?సూర్యనారాయణ, ?ఎన్. వెంకట రెడ్డి, ?ఎన్. శంకర్ ,శ్రవణ్, ?జి. దేవా సింగ్ ?నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఏ ఒక్క ఓటు పోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి...

## - పాతపాల్వంచ 46 వ డివిజన్లో ఓటర్లకు నోటీసులు అందజేత

పాల్వంచ,జనం ముచ్చట

ప్రతి ఒక్క ఓటు కూడా ఎంతో విలువైనదని, ఏ ఒక్క ఓటు కూడా పోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని డి.సీ.ఎం.ఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు.ఓటర్ల జాబితా సవరణ (సర్–2) లో భాగంగా శనివారం పాత పాల్వంచ లోని 78, 79 పోలింగ్ బూతులలో ఓటర్లకు నోటీసులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బి.ఎల్.ఓ.లు, బి.ఎల్.ఎ లతో పాటు కొత్వాల, కార్పొరేటర్ విమలాదేవి లు పాల్గొని ఓటర్లకు వివరాలు తెలిపారు.ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ... ఓటర్ల నమోదుల సర్ ఫేజ్–2 కీలకమైనదని, బి.ఎల్.ఓ తో పాటు బి.ఎల్.ఏ లు విధిగా పాల్గొని, సమాచారం లేని ఓటర్ల వివరాలు తెలపాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు ఫారం - 6 ద్వారా ఓటు హక్కు కల్పించేలా కృషి చేయాలని కొత్వాల అన్నారు. ఈ కార్యక్రమంలో బి.ఎల్.ఓ లు చందార్కర్, రచ్చా వరుణ్, బి.ఎల్.ఏ లు షేక్ ఖాజమియా, మసనం శరత్, కొత్తగూడెం కార్పొరేషన్ 46 వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి, 47 డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి వాసుమల్ల సుందర్ రావు, 46 వ డివిజన్ సిపిఐ ఇంఛార్జి షేక్ అబ్దుల్ రహ్మాన్, కాంగ్రెస్ నాయకులు సయ్యద్ యాకూబ్, సయ్యద్ కరీం, గడదేశి ప్రభాకర్, బూసి శ్రీను, యాటా నాని, బాబి, గుడపాటి నాగేశ్వరరావు, కట్టా శ్రీను తదితరులు పాల్గొన్నారు.